విద్యార్థులకు డిజిటల్ తరగతులు



ప్లాట్ ప్యానల్ ద్వారా డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు

మూసాపేట: ప్రభుత్వ పాఠశాలలు టెక్నాలజీని ఉపయోగించుకొని అత్యుత్తమ మార్పులు సాధించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాణిస్తారని ఉపాధ్యాయులు అంటున్నారు. మూసాపేటలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో డిజిటల్ క్లాసులు విద్యార్థులు వింటున్నారు. ప్లాట్ ప్యానల్‌లో ప్రభుత్వ పదో తరగతి విద్యార్థులు పాఠాలు వింటున్నారు. మధ్యలో స్క్రీన్ ఉండి రెండువైపులా బోర్డు ఉంటుంది. స్క్రీన్‌లో వైఫై ఉపయోగించి యూట్యూబ్ పాఠాలు చెప్పవచ్చు. మళ్లీ స్క్రీన్‌పై రాసి వివరించి చెప్పవచ్చు. స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతూనే పక్కన బోర్డుపై కూడా రాస్తు వివరించవచ్చు. పదో తరగతి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పాఠశాల ఉపాధ్యాయులు అంటున్నారు. డిజిటల్ క్లాసులు బాగున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. పాఠశాలలో మొత్తం 3 ప్లాట్ ప్యానల్, 4 ఎఈడీ టీవీలు డిజిటల్ క్లాసుకు ఉన్నాయని అంటున్నారు.

తులసీనగర్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ తులసీనగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో మూడోసారి అధ్యక్షుడిగా చ్రందశేఖర్‌రెడ్డిని సంక్షేమ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సీహెచ్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా ప్రశాంత్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా సిద్ధారెడ్డి, ట్రెజరర్‌గా శంకర్‌రావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష పదవిని అందజేసినటందుకు అందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులుతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ కాలనీ అభివృద్ధికి పాటుపడతామని పేర్కొన్నారు.

దేవుడి భూములకు రక్షణ



- కొత్త ప్రభుత్వం ఆదేశాల నేపథ్యం లో కసరత్తు
- గ్రేటర్‌సహా శివారు జిల్లాల్లో 21,386 ఎకరాల దేవాదాయ భూములు
- కబ్జాదారుల ఆధీనంలో 5,462 ఎకరాలు
- కోర్టుల్లో వివాదాల్లో 760 కేసులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లోని దేవాదాయ, ధర్మాదాయ భూముల పరిరక్షణకు కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అధికార యంత్రాంగం దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక కార్యాచరణకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే దేవాలయాల వారిగా సంబంధిత భూములపై సమగ్ర సమాచారంపై ఆరా తీస్తున్నారు. కబ్జాదారుల ఆక్రమణలో ఉన్న దేవాదాయ భూములకు సంబంధించిన కోర్టు కేసులను పునః పరిశీలించడంతోపాటు త్వరలో పరిష్కారం అయ్యేలా తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలపై కూడా కార్యాచరణ రూపొందించాలని యంత్రాంగం భావిస్తోంది.

ఆక్రమణలో 5,462 ఎకరాలు

గ్రేటర్‌తో సహా రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో మొత్తంగా దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు 21,386 ఎకరాలు ఉండగా, ఇందులో 5,462 ఎకరాల భూములు ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. ఇందుకు ఉదాహరణగా మేడ్చల్ జిల్లాలోని దేవరయాంజల్‌లో సీతారామచంద్రస్వామి భూముల కబ్జాను సంబంధిత అధికారులు చెబుతున్నారు.

వివిధ కోర్టుల్లో 760 కేసులు

నగర శివారుల్లో కబ్జాదారుల ఆక్రమణల్లో ఉన్న దేవాదాయ భూములకు సంబంధించి 760 కేసులు వివిధ కోర్టుల్లో కొనసాగుతుండగా, వాటి పరిరక్షణపై ప్రత్యేక కసరత్తు చేస్తోంది. గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లో ఇప్పటి వరకు 2,352 ఎకరాల భూములను వివిధ పద్ధతుల్లో పరిరక్షిస్తున్న దేవాదాయ శాఖ.. ముందస్తుగా తమ ఆధీనంలో ఉన్న భూముల రక్షణకు ఫెన్సింగ్ వంటి పటిష్టమైన చర్యలకు సిద్ధం కావాలని భావిస్తోంది.

దేవాదాయ భూములివే..

దేవాదాయ భూములకు సంబంధించి హైదరాబాద్ జిల్లాలో 5,217 ఎకరాలు ఉండగా, దీనికి సంబంధించిన భూములు మనరాష్ట్రంలో 2,500 ఎకరాలు, నల్లగోండ జిల్లాలో 354 ఎకరాల భూములు భద్రంగా ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. రంగారెడ్డి జిల్లాలో 9,929 ఎకరాలు దేవాదాయ భూములు ఉండగా, మేడ్చల్ జిల్లాలో 3,941 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 2,299 ఎకరాలు దేవాదాయ శాఖ భూములు ఉన్నట్లు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాల నేపథ్యంలో తమ ఆధీనంలో ఉన్న భూముల పరిరక్షణకు దేవాదాయ శాఖ ప్రత్యేక చర్యల్లో భాగంగా ఫెన్సింగ్ వంటి కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని భావిస్తోంది.

మాలలకు భాగ్యరెడ్డి వర్మ ఆదర్శం

ఉస్మానియా యూనివర్సిటీ: మాలలకు భాగ్యరెడ్డి వర్మ ఆదర్శమని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షులు నాను సైదులు పేర్కొన్నారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. హైదరాబాద్ నిజాం సంస్థానంలో విద్యా మంత్రిగా పనిచేసి దళిత బాలికల కోసం 26 పాఠశాలలను స్థాపించి మహిళల విద్యావ్యాప్తికి కృషి చేశారని కొనియాడారు.

'మానవ హక్కులను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు'



ఉమెన్ రైట్స్ సోషల్ జస్టిస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

మోతీనగర్: మానవ హక్కులను కాపాడటంలో ఉమెన్ రైట్స్ సోషల్ జస్టిస్ మిషన్ ఎప్పుడు ముందుంటుందని ఆ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఉమెన్ రైట్స్ సోషల్ జస్టిస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి అన్సర్ మహ్మద్ మట్లాడుతూ... ఏ రంగంలోనైనా మానవ హక్కుల కోసం ప్రభుత్వాలే కాదు స్వచ్ఛంద సంస్థలు కూడా కృషి చేయాలన్నారు. త్వరలో మోతీనగర్‌లో ఉమెన్ రైట్స్ సోషల్ జస్టిస్ మిషన్ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. మానవ హక్కులను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో రేష్మా, ఎండీ హబీబ్ పాల్గొన్నారు.

ఘనంగా ఈదమ్మ, ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు

అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

మూసాపేట: మూసాపేటలో ఈదమ్మ, ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అనంతరం మైసమ్మ తల్లి, ఈదమ్మ తల్లికి బోనాలను మొక్కులుగా సమర్పించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నోముల సుందర్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, సలహాదారులు స్వామి, రాజు, యాదయ్య, శంకర్, కోశాధికారి ప్రవీణ్, నరేష్, శ్రీశైలం, శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణ, బాబు, మల్లేష్, అశోక్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



మూసాపేటలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



మహిళలకు కుట్టుమెషిన్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఏవీబీపురంలోని కార్డ్ స్వచ్ఛంద సంస్థ వారు మహిళలకు నిర్వహించిన మహిళలకు ట్రైనింగ్ అనంతరం వారికి ధ్రువీకరణ పత్రాలు, కుట్టుమిషన్లు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కమార్, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కార్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్డు స్వచ్ఛంద సంస్థ ద్వారా మహిళలు ఆర్థికంగా ఉన్నతి సాధించాలన్న ఉద్దేశంతో వారికి ఈ విధంగా తోడ్పాటును అందిస్తున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్డు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సుమన్, కూకట్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంతోష్, జనరల్ సెక్రటరీ ప్రభాకర్, బొట్టు విష్ణు, దారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ ఎన్నికలు సజావుగా జరిపించాలి



సమావేశంలో పాల్గొన్న ప్రస్తుత అధ్యక్షుడు రోణంకి జగన్నాథం, సభ్యులు

మోతీనగర్: శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం వివేకానందనగర్ కమ్యూనిటీహాల్‌లో జరగింది. ఈ సమావేశంలో కాలనీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇప్పటి వరకు ఉన్న విధివిధానాలు, భవిష్యత్తులో అనుసరించాల్సిన విధివిధానాలు గురించి చర్చించి ఏకాభిప్రాయానికి వచ్చారు. రానున్న రోజుల్లో కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు సజావుగా జరిపించాలని ఎన్నికల అధికారులుగా శ్రీ సామ కొండల్‌రెడ్డి, పి. రామ చంద్రారెడ్డిలను నిర్ణయించి తీర్మానించారు. ఎన్నికలు పూర్తయి కొత్తగా బాధ్యతలు అప్పచెప్పేవరకు ఎన్నికల కమిషన్ తీసుకునే నిర్ణయాలకు లోబడి అందరూ పనిచేస్తామని కాలనీ సభ్యులు తీర్మానించారు. తీర్మాన పత్రాన్ని ప్రస్తుత అధ్యక్షుడు రోణంకి జగన్నాథం ఎన్నికల అధికారులకు అందజేశారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు, బండి మధుసూదన్‌రెడ్డి

మూసాపేట: రెయిన్‌ట్రీ విస్టాస్ రాక్ గార్డెన్‌లో ఆదివారం సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో తలసీమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. 150 మంది నివాసితులు రక్తదానం చేశారు. ముఖ్యఅతిథులుగా కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు పాల్గొని రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. సామాజిక సేవలో గేటెడ్ కమ్యూనిటీలు ముందుండటం గర్వించదగిన విషయమని ఆయన కొనియాడారు. కార్యనిర్వాహకులకు అభినందనలు తెలియచేశారు. జరిగిన ఈ కార్యక్రమంలో ప్రదాన కార్యదర్శి అల్లూరి శివప్రకాష్, ఉప ప్రధాన కార్యదర్శి నామినేని శ్రీనివాస్, టి.రామ్, కిరణ్, ప్రమోద్‌రెడ్డి, ఆర్వ ప్రసాద్, వంశీ, శ్రీపాద్, గాంధీ పాల్గొన్నారు.

రేణుకా చౌదరికి శుభాకాంక్షలు



కూకట్‌పల్లి: కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరిని రాజ్యసభకు ఎంపిక చేసిన సందర్భంగా ఆదివారం కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, తూము వేణు, చున్ను పాషా, గోపాల్‌రెడ్డి, యాదగిరి, నయీమ్, రమేష్, అస్లాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పూర్వ విద్యార్థులు చేయూతనివ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో చదివే పేద విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు చేయూతనివ్వాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు నెల్లి సత్య విజ్ఞప్తి చేశారు. ఓయూలో చదివి దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడి యూనివర్సిటీకి కోట్ల రూపాయాలు విరాళంగా అందచేస్తున్న పూర్వ విద్యార్థులు సదస్సులు, సన్మానాలు, సంబరాలే కాకుండా పేద విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు. ఫీజులు పెరిగి, ఫెలోషిప్, స్కాలర్‌షిప్ అందని విద్యార్థులకు ఓయూ పూర్వవిద్యార్థుల సంఘం అలూమ్నీ పేరు మీద నెలకు రూ.15 వేల ఫెలోషిప్ అందజేయాలని సూచించారు. ఓయూ బోధన, పరిశోధన కుంటుపడిందని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఖాళీగా ఉన్న అధ్యాపక, బోధనేతర ఉద్యోగాల భర్తీకి కృషి చేయాలన్నారు.